క్లుప్తంగా

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

డోన్: స్థానిక మాలిక్‌బాబా సంస్థాన్ ఆరాధనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కళల్లో ప్రతిభావంతులైన కళాకారులను ఆదివారం ఘనంగా సత్కరించారు. తబలా, హార్మోనియం, మృదంగ వాయిద్యాలతో ఏళ్లుగా స్వామి వారి ఆరాధనోత్సవాల్లో పాల్గొంటున్న పది మంది కళాకారులను పూలమాలలు, శాలువాలతో పాటు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కమిటీ అధ్యక్షులు రామక్రిష్ణ, క్రిష్ణయ్య, సభ్యులు నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అవోపా అధ్యక్షుడిగా రంజిత్



రంజిత్‌ను అభినందిస్తున్న సభ్యులు

డోన్ టౌన్ : డోన్ అవోపా అధ్యక్షుడిగా యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన మాకం రంజిత్ కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత అధ్యక్షుడు మాకం కృష్ణకిషోర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్థానంలో కుమారుడైన మాకం రంజిత్ కిరణ్‌ను సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అవోపా కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, సభ్యులు రంగయ్య, సుదర్శన్‌రావు, ఓలేటి మాధవ స్వామి, తల్లం సత్యనారాయణ, భూషణం, బచ్చు జయశీలగుప్త పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు

అవుకు: వినాయక విగ్రహాల శోభాయాత్రలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజారెడ్డి అన్నారు. అవుకు మండలంలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన వారు సోమవారం మధ్యాహ్నం నుంచే నిమజ్జన వేడుకలను ప్రారంభించాలని తెలిపారు. విగ్రహాల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. అలాగే నిమజ్జన ప్రదేశంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆస్తి కోసం తండ్రిపై దాడి

సంజామల: ఆస్తి కోసం తండ్రిపైనే దాడి చేసిన ఘటన మండల పరిధిలోని నొస్సం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తలారి నరసింహుడుకు ఇద్దరు కుమారులు. ఇద్దరికి తన ఆస్తిని సమానంగా పంపకాలు చేశాడు. తర్వాత ఇతరుల నుంచి 32 సెంట్ల భూమిని తలారి నరసింహుడు కొనుగోలు చేశాడు. ఈ నెల 4వ తేదీ ఆ స్థలం కావాలని చిన్న కుమారుడు తలారి వెంకటేశ్వర్లు, కోడలు రమాదేవి వాగ్వాదానికి దిగారు. అనంతరం దాడి చేసి గాయపరిచారు. తలారి నరసింహుడు ఫిర్యాదు మేరకు కుమారుడు తలారి వెంకటేశ్వర్లు, రమాదేవిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నివాళి

డోన్ టౌన్: ప్యాపిలి మండలం బావిపల్లె గ్రామానికి చెందిన లారీ యజమాని శ్రీనివాసులు (50) ఈ నెల 7వ తేదీ గుండెపోటులో మృతిచెందారు. విషయం తెలుసుకున్న లారీ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, యూనియన్ నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. యూనియన్ నాయకులు లక్ష్మన్న, పుల్లయ్య, తిమ్మప్ప, లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

డోన్ టౌన్: ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు అవుతున్నా ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న రహిమాన్‌తో కలిసి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలో టీడీపీ కూటమి రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మూడు గ్యాస్ సిలిండర్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు నాగరాజు, శ్రీకాంత్, శివరామ్, భాస్కర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాలకు మురిగిన గుడ్లు



కోవెలకుంట్ల: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సెప్టెంబర్ నెలకు సంబంధించి మురిగిపోయిన గుడ్లను సరఫరా చేశారు. సౌదరదిన్నె అంగన్‌వాడీ కేంద్రానికి రెండు రోజుల క్రితం గుడ్లు అందజేయగా కార్యకర్తలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆదివారం ఓ మహిళ తమ పిల్లలకు గుడ్లను వండిపెట్టేందుకు తీసుకోగా రెండు గుడ్లు మురిగిపోయి దుర్వాసన వచ్చాయి. వెంటనే గుడ్లను ఇంట్లో నుంచి బయట పడేసింది. మురిగిపోయిన గుడ్లను ఇచ్చి చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బేతంచెర్ల: బైటిపేటలో కొలువుదీరిన గణనాథుడు



కొలిమిగుండ్లలో భారీ గణనాథుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కోవెలకుంట్ల: సీతారామనగర్‌లో..



కోవెలకుంట్ల: ఏకలవ్యనగర్‌లో హోమ పూజలు



ప్యాపిలి: చిన్నపొదిళ్లలో..

విఘ్నాలు తొలగించు విఘ్నేశ్వరా

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- వివిధ రూపాల్లో ఆకట్టుకున్న లంబోదరుడు
- ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు
- మార్మోగిన జై.. జై గణేశా నామస్మరణ



బనగానపల్లెలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



డోన్: రంగవల్లుల పోటీలో మహిళలు

కోవెలకుంట్ల: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో శనివారం నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మండలాల్లో వినాయక విగ్రహాలను కొలువుంచారు. మండపాలను నిర్వాహకులు వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో పోటాపోటీగా అలంకరించారు. వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మండపాలతో పాటు వినాయకస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల పట్టణంలో పాండురంగస్వామి దేవాలయం, సంతమార్కెట్, రంగరాజుపేట, సభాపతి రోడ్, రామాలయం, కుమ్మరివీధి, పెద్దమ్మగుడి, గాంధీనగర్, బీఎస్‌ఎన్‌ఎల్ టవర్, బసిరెడ్డిబావి వీధి, దాసరివీధి, చిన్నబారం ఇమాం చావిడి, సంతపేట, ఎస్‌ఎల్‌వీటీ, గుద్దేటివీధి, చాకలిపేట, శ్రీవిద్యసూకల్, నాగులకట్ట, కరెంట్‌ఆఫీస్, సాయినగర్, సీతారాంనగర్, పాత పోస్టాఫీస్, సాయినగర్, పాతశివాలయం, ఏకలవ్యనగర్, అమ్మవారిశాల, గాంధీసెంటర్, సుంకులమ్మ వీధి తదితర ప్రాంతాల్లో 61 చోట్ల వివిధ రూపాల్లో నాలుగు అడుగుల నుంచి 14 అడుగుల ప్లాస్టర్‌ఆఫ్‌పారిస్, మట్టి వినాయక విగ్రహాలను కొలువుంచారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 40 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కొలిమిగుండ్ల: హిందువులు ఏ కార్యం తలపెట్టినా నిర్విఘ్నంగా సాగాలంటే వినాయకుని అనుగ్రహం తప్పనిసరి ఉండాలని భావిస్తారు. గణపతి పూజ అనంతరమే వివిధ పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మచేతిలో పసుపు ముద్దగా అవతరించి పసుపు గణపతిగా పూజలు అందుకుంటున్న ఆదిదేవుడైన గణపతి ఆవిర్భవించిన రోజే మనం జరుపుకుంటున్న వినాయకచవితి. మండల వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వాడవాడలా వివిధ రూపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బెలుం తదితర గ్రామాలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గణనాథుల వద్ద భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి గణనాథులను నిమజ్జనానికి తరలించనున్నారు.

డోన్: నియోజకవర్గ వ్యాప్తంగా 251 విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత 3 రోజుల నుంచి 5 రోజులకు ఉత్సవాలు జరుపుకునేందుకు అనుమతించారు. దీంతో నిర్వాహకులు ఉత్సాహంగా మండపాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. చిరుజల్లులు కురుస్తున్నా లెక్కచేయకుండా సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బేతంచెర్ల: పట్టణంలో కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 41 గణేశుని విగ్రహాలను కొలువుంచారు. ఆయా కాలనీలు, వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వినాయక విగ్రహాలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. బేతంచెర్లతోపాటు ముద్దవరం, ఆర్‌ఎస్ రంగాపురం, శంకరాపురం, సీతారామాపురం, యంబాయి, ముసలాయిచెర్వు, యం.పెండెకల్లు, సిమెంట్ నగర్ గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బైటిపేటలో నెమలి పింఛం వినాయకుడు, అమ్మవారిశాల్లో వాసవీ గణేష్, సత్రం వద్ద సర్వజన గణేష్, పాతబస్టాండ్‌లో విశ్వ గణేష్, స్టేట్ బ్యాంకు దగ్గర శివ గణేష్, కొత్త బస్టాండులో సరస్వతి గణేష్, శ్రీనగర్ కాలనీలో మూషిక వాహన వినాయకుడు, దుర్గాపేటలో సిద్ధేశ్వర వినాయక విగ్రహాలు ఆకర్షణగా నిలిచాయి.

బనగానపల్లె: పట్టణంతో పాటు మండంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. బనగానపల్లెలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో కొలువుదీరిన గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేశారు. అలాగే పెండేకంటి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి కాటసాని చంద్ర శేఖర్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, లాయర్‌బాబు, రామచంద్రారెడ్డి, వినాయకరెడ్డి, పినాకిరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

అవుకు: మండల కేంద్రంలో ఈ ఏడాది భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాల వద్ద పూజలతో పాటు యువకులు వివిధ పాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు.

సంజామల: మండలంలో సుమారు 50 మండపాల్లో బొజ్జ గణపతిని కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద భక్తిపాటలు, సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా సోమవారం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



కొలిమిగుండ్ల అంకిరెడ్డిపల్లెలో..



బేతంచెర్ల సంజీవ నగర్ కాలనీలో..

ప్యాపిలి: వినాయకచవితి సందర్భంగా శనివారం అన్ని గ్రామాల్లో గణనాథులను ప్రతిష్ఠించారు. పలు గ్రామాల్లో ఆదివారం వినాయకున్ని నిమజ్జనం చేశారు.

ప్యాపిలిలో ఈ ఏడాది కూడా చవితి వేడుకలపై నిషేధం కొనసాగింది. 2003లో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అప్పటి నుంచి చవితి వేడుకలపై నిషేధం విధించారు. ఈ ఏడాది కూడా ఇళ్లలో చిన్న వినాయకులను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు.



బేతంచెర్లలో..



మద్దిలేటిస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈఓ



డోన్ సాయి నగర్‌లో ఏర్పాటైన వినాయకుని విగ్రహం,



అవుకు ముస్లిం వీధిలో..



డోన్: ఇందిరానగర్‌లో అన్నదానం

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు



సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నాయకులు

బనగానపల్లె రూరల్: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు అని బనగానపల్లె వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బిచ్చయ్య అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న మండలానికి చెందిన పి.ముకుందరెడ్డి, యల్ల సుబ్బయ్య, నందిగాళ్ల ప్రతాప్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బిచ్చయ్య మాట్లాడుతూ.. మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకోవడం హర్షణీయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, అవుకు ఎంఈఓ శ్రీధర్‌రావు, ఏఎస్‌ఐ లక్ష్మయ్య, ఏఈ గౌస్, హెచ్‌ఎం సోమ శేఖర్‌రెడ్డి, కుమార్‌బాబు పాల్గొన్నారు. అలాగే యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముకుందరెడ్డి, యాపర్ల లక్ష్మీనారాయణను సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు మురళి, కిశోర్, శ్రీనివాసులు, బింగిమళ్ల గోపాల్, దస్తగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాంపుల్లారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: పట్టణంలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద డీఎస్పీ శ్రీనివాసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు కాలనీల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నిమజ్జనం రోజున ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఊరేగింపు రూట్ మ్యాప్‌లపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా సాగే ఈ ఊరేగింపు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం



మునిగిన పంట వివరాలను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల: మండలంలో అధిక వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సంజామలలో పాలేరు వాగు వరద ప్రవాహంలో మునిగిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీఓ విజయకుమార్‌రెడ్డితో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సంజామల, ఎగ్గోని ముచ్చలపురి, కమలపురి, బొందలదిన్నె గ్రామాల్లో సుమారు 250 ఎకరాలు వరి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. ఏడీఏ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి బీసీకి సమస్యలు వినతి

బనగానపల్లె రూరల్: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం తన క్యాంపు ఆఫీస్‌లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా అందించే పైప్‌లైన్లకు ఆదివారం సర్పంచ్ శివరాముడు మరమ్మతులు చేయించారు. పలు చోట్ల పైపులకు లీకేజీలు ఏర్పడి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడేది. లీకేజీ ఏర్పడిన చోట వెల్డింగ్‌తో మరమ్మతులు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పలు కాలనీల్లో వెలగని వీధిలైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.


గాయపడిన వ్యక్తి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామానికి చెందిన మద్దూరు హనుమన్న(79) ఈనెల 3వ తేదీ ఇంటి మెట్లు దిగుతుండగా కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుని కొడుకు మధుశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా ఆదివారం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డోన్ టౌన్: పట్టణంలో సోమవారం వినాయక విగ్రహాల శోభా యాత్ర సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలు ఊరేగింపుగా వెళ్లే మార్గాలు, డోన్ సబ్‌స్టేషన్‌తో పాటు పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్–1 టౌన్–2, హైవే ఫీడర్ కింద మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న గంధం గణేశుడు



గంధంతో తయారు చేసిన వినాయకుడు

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట అమ్మవారిశాలలో కొలువైన వినాయకుడు సుగంధ ద్రవ్య పరిమళం వెదజల్లుతున్నాడు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్యులు ప్రత్యేకంగా గంధంతో తయారు చేసిన వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.



ఉత్సవమూర్తికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పల్లకీ సేవ.. : పట్టణంలోని వినాయకుడి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. శనివారం ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ అనంతరం కర్పూర హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తికి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు.



పల్లకీపై విహరిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి

ఘనంగా స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసాన్ని పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు కళ్యాణ చక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూలమంత్ర జపం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు చేశారు. ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి, అర్చకులు మనోహర్, రాఘవయ్య, మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న చెంచులక్ష్మి సమేత పాపన నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి తులసీ దళాలతో అర్చనలు, నవగ్రహ పూజలు, అభిషేకాలు తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, అర్చకుడు బాలిశెట్టి నరసింహామూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.